




సోమవారం ఉష్ణోగ్రత

	కనిష్టం	గరిష్టం
ఖమ్మం	21	33
భద్రాద్రి కొత్తగూడెం	25	35

స్వేదమే వారి జీవననాదం

కొత్తపల్లి గోదావరి తీరంలో ఆదివాసీల కుటీరాలు



గోదారమ్మకు దుప్పటి కప్పినట్టు ఉన్న మిరప

- గోదావరి తీరాన అడవిబిడ్డల బతుకుపోరు
- మిర్చి తోటల్లో ఛత్తీస్‌గఢ్ వలస కూలీల ఉపాధి
- ఇసుకతిన్నెల్లో మకాం.. ఆకట్టుకుంటున్న జీవనశైలి

చర్ల, ఫిబ్రవరి 26: బతుకు బాటలో ఉపాధి వేట సాగిస్తూ తరలివచ్చిన వలస కూలీల 'బతుకు చిత్రం' గోదావరి ఇసుకతిన్నెల్లో సాక్షాత్కరిస్తోంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలో ఛత్తీస్‌గఢ్ వలస కూలీలు గోదావరి తీరంలోని మిర్చి తోటల్లో పనులు చేస్తూ ఇసుక తిన్నెల్లో గుడారాలు ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చిన అనేకమంది ఆదివాసీ కూలీలు చర్ల మండలంలోని కొత్తపల్లి, గొంపల్లి, లింగాపురం, వీరాపురం గోదావరి తిన్నెల్లో మకాం వేశారు. వారికి కావాల్సిన నూకలు, పప్పుదినుసులు, వంట సామగ్రి, కట్టెలు తీసుకుని వచ్చారు. ఉదయాన్నే వంటా, వార్పు చేసుకుని సమీప మిర్చి తోటల్లో పనులకు వెళుతున్నారు.

పగలు పనులు.. రాత్రి పాటలు..

ఇలా వలస వచ్చిన ఆదివాసీలు వారు తెచ్చుకున్న నూకలు, పప్పు దినుసులతో అంబలి, ఇతర వంటకాలు చేసుకుంటారు. సాయంత్రం 7 గంటలకే భోజనాలు ముగించి అనంతరం అందరూ ఓ చోటచేరి ఆటాపాటలతో గడుపుతున్నారు. దీంతో ప్రతీ రోజు గోదావరి ప్రాంతంలో కోలాహలం కనిపిస్తోంది. రాత్రి సమయంలో రేపు చేయబోయే పనుల గురించి చర్చించుకుంటున్నారు. ఒక రైతు దగ్గర పనులు ముగిస్తే మరో రైతు వద్దకు మకాం మారుస్తూ బతుకు పోరు సాగిస్తున్నారు.

గోదారమ్మ ఎర్ర దుప్పటిలా

మిరప పంట చేతికి రావడంతో చర్ల మండలంలోని అనేక మంది రైతులు కూలీలతో కాయలు కోయిస్తున్నారు. అనంతరం ఆ కాయలను ఆరబెట్టేందుకు స్థలం లేకపోవడంతో కోసిన మిర్చి కాయలను గోదావరి తీరంలో ఆరబెడుతున్నారు. ఈ క్రమంలో కాయలను గ్రేడింగ్ చేయించి అక్కడే బస్తాల్లోకి నింపే పనులు చేస్తున్నారు. ప్రస్తుతం చర్ల మండలంలోని సుమారు 20 కిలోమీటర్ల పరిధిలో ఉన్న గోదావరి తీరంలో ఎక్కడ చూసినా ఆరబోసిన మిర్చినే దర్శనమిస్తోంది. ఈ దృశ్యాలు చూస్తే గోదారమ్మకు ఎర్ర దుప్పటి కప్పారా.. అనే భావన కలుగుతోంది.

సంపాదన ఇక్కడే.. ఖర్చూ ఇక్కడే..

మిర్చి కోతల సీజన్‌లో ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చే వలస కూలీలు ఇక్కడ సుమారు నాలుగు నెలలు పనులు చేస్తారు. వీరికి ఇక్కడ మిర్చి కోతలకోసం రోజుకు రూ.250కూలి వస్తుంది. వీరు ఒక్కొక్కరు సీజన్ మొత్తంలో సుమారు రూ.20వేల వరకు సంపాదిస్తారు. వీరు సంపాదించిన దాంతో రోజువారీ ఖర్చులు పోను మిగిలిన డబ్బుతో వీరు తిరిగి వెళ్లే సమయంలో తమ ఇంటికి కావాల్సిన సామగ్రి, ఆహార ఉత్పత్తులను కొనుగోలు చేసుకొని తీసుకెళతారు.



ఖమ్మం నగరంలో మందుల పంపిణీ దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న డ్రగ్ అధికారులు

ఆర్‌ఎంపీలకు మందులు
అమ్మొద్దు..

డ్రగ్స్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ప్రసాద్

ఖమ్మం కలెక్టరేట్, ఫిబ్రవరి 26: ఆర్‌ఎంపీలకు, గుర్తింపు లేని మందుల దుకాణాలకు మందుల పంపిణీదారులు ఔషధాలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డ్రగ్స్ సహాయ సంచాలకుడు ప్రసాద్ హెచ్చరించారు. ఖమ్మం నగరంలో సోమవారం వివిధ ప్రాంతాల్లో ఔషధ పంపిణీ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో కొన్ని మండలాల్లో ఆర్‌ఎంపీలు ఇష్టారాజ్యంగా యాంటీబయాటిక్స్ వినియోగిస్తున్నట్లు వచ్చిన ఆరోపణలపై అనుమతులు లేని దుకాణాలకు, ఆర్‌ఎంపీలకు ఏ విధంగా విక్రయిస్తున్నారనే విషయాలపై తనిఖీలు నిర్వహించారు. ఆయా పంపిణీ దుకాణాల్లో రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఏ దుకాణానికి ఎంత స్టాకు పంపించారు. ఆ దుకాణానికి ఉన్న అనుమతులను వారు ఈ తనిఖీల్లో పరిశీలించారు. మొత్తం పది దుకాణాల్లో తనిఖీలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఈ తనిఖీల్లో డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు అనిల్‌కుమార్, సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాలకుల తీరు వల్లే
కృష్ణా జలాల వివాదం



- గత పాలకుల తప్పిదాలను సీఎం రేవంత్ కొనసాగిస్తున్నారు
- కాంగ్రెస్ హామీల అమలుకు రూ.5 లక్షల కోట్ల బడ్జెట్ కావాలి
- కేంద్రంలో మళ్లీ వచ్చేది బీజేపీ ప్రభుత్వమే..
- బీజేఎల్‌పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి
- సత్తుపల్లి చేరిన విజయసంకల్ప యాత్ర



సత్తుపల్లి సభలో మాట్లాడుతున్న ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, హాజరైన మహిళలు

సత్తుపల్లి/దమ్మపేట, ఫిబ్రవరి 26: కృష్ణాజలాల విషయంలో గత ప్రభుత్వం చేసిన తప్పులను ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి కూడా చేస్తున్నారని బీజేపీ శాసనసభాపక్ష నాయకుడు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో భద్రాచలం నుంచి బీజేపీ చేపట్టిన విజయసంకల్ప యాత్ర ఖమ్మం జిల్లాకు చేరుకుంది.

ఈ సందర్భంగా సత్తుపల్లిలో జరిగిన కార్యక్రమంలో మహేశ్వర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. కృష్ణాజలాల నిర్వహణను కేఆర్‌ఎంబీకి అప్పగించేందుకు నిరాకరించి గత ప్రభుత్వం మాదిరిగానే ప్రస్తుత సీఎం వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అబద్ధాల పునాదులపై పుట్టుకొచ్చిన కాంగ్రెస్ పార్టీ మరోసారి ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ ఇచ్చిన 412 హామీలలో ఒక్క హామీ కూడా అమలు చేయలేదన్నారు. కాంగ్రెస్ హామీలు అమలు చేయాలంటే సుమారు రూ.5లక్షల కోట్ల బడ్జెట్ అవసరమన్నారు. కానీ బడ్జెట్‌లో పథకాలకు రూ.53వేల కోట్లు మాత్రమే కేటాయించారని విమర్శించారు.

కాంగ్రెస్ హామీలు అమలు చేయకపోతే మరో ఆరు నెలల్లో ఆ పార్టీ ఎమ్మెల్యేలను గ్రామాల్లో ప్రజలు తిరగనివ్వబోరని హెచ్చరించారు. ఎస్సీ వర్గీకరణకు బీజేపీ కట్టుబడి ఉందన్నారు. ఈ విషయంపై అసెంబ్లీలో తీర్మానం చేసి ఇవ్వాలని కోరితే సీఎం రేవంత్‌రెడ్డి తిరస్కరించారన్నారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు బీజేపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు గెల్లా సత్యనారాయణ, ఖమ్మం పార్లమెంటరీ అధ్యక్షుడు నంబూరి రామలింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రంలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమే..

అంతకుముందు భద్రాద్రి జిల్లా దమ్మపేటలో జరిగిన విజయ సంకల్పయాత్రలో ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ మూడోసారి విజయం సాధించి మళ్లీ కేంద్రంలో అధికారం చేపడుతుందని, మళ్లీ మోదీ ప్రధానమంత్రి అవుతారని తెలిపారు. ప్రస్తుతం ప్రపంచ దేశాలన్నీ మన దేశంలో జరుగుతున్న అభివృద్ధిని చూస్తున్నారన్నారు. మోదీ మళ్లీ ప్రధాని అయితే భారత్‌ను ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దేందుకు విజన్ సిద్ధం చేశారన్నారు. రాష్ట్రంలో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలపై రూ.6లక్షల కోట్ల అప్పులను ప్రజలపై మోపిందన్నారు. సంక్షేమ పథకాల ముసుగులో దోచుకున్నారని ఆరోపించారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో రైతుబంధు వేయలేదన్నారు. రెండులక్షల రుణమాఫీ ఎప్పుడు చేస్తారో స్పష్టత లేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై సీబీఐతో విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. సభలో రాష్ట్ర బీజేపీ ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి మాట్లాడారు.



రామయ్యా.. ఎట్లాగయ్యా!

- భద్రాచల దేవస్థానానికి నిధుల కష్టం
- ఏటా ప్రధాన ఉత్సవాల నిర్వహణ భారం
- రెండు ప్రధాన ఉత్సవాలకు రూ.5కోట్ల పైనే వ్యయం
- ఆమోదానికి నోచుకోని నిధుల పెంపు ప్రతిపాదన

భద్రాచలం, ఫిబ్రవరి 26: దక్షిణ అయోధ్యగా విరాజిల్లుతున్న భద్రాచల పుణ్యక్షేత్రంలో ఏటా నిర్వహించే ప్రధాన ఉత్సవాలకు ఆర్థిక భారం నానాటికీ పెరుగుతోందని దేవస్థానం వర్గాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ప్రతీఏటా చైత్రమాసంలో శ్రీరామనవమిని పురస్కరించుకొని శ్రీసీతారామ చంద్రస్వామి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. అలాగే ధనుర్మాస సమయాన వైకుంఠ ఏకాదశి మహోత్సవాలు(ముక్కోటి) నిర్వహిస్తారు. ఇందు కోసం దేవస్థానం వెచ్చిస్తున్న డబ్బులు భక్తులనుంచి వచ్చిన మొత్తం నుంచే ఖర్చు చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఆయా ఉత్సవాల ఏర్పాట్ల కోసం ఏ మాత్రం నిధుల కేటాయింపు లేకపోవడంతో దేవస్థానంపై ఆర్థిక భారం పెరుగుతూనే ఉంది. ఆరంభంలో లక్షల్లో ఉండే ఏర్పాట్ల వ్యయం నేడు రూ.5 కోట్లను దాటడం గమనార్హం. ఉత్సవాలకు నిధుల కష్టాలపై గతేడాది ఫిబ్రవరి 27న 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనంపై అప్పటి ప్రభుత్వం స్పందించి రూ.రెండు కోట్లు విడుదల చేసింది. అయితే ఆ మొత్తం కలెక్టర్ ఖాతాకు జమకావడంతో దానివల్ల దేవస్థానానికి పెద్దగా ఒరిగిందేమీ లేదనే వ్యాఖ్యలు సైతం వినిపించాయి.

బ్రహ్మోత్సవాలకు రూ.2.80కోట్ల పైమాటే

ఈసారి శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలకు దేవస్థానం రూ.2.50 కోట్లు పైనే వెచ్చిస్తోంది. ఇందులో రూ.1.50కోట్లతో దేవస్థానం ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో పనులను చేపట్టనున్నారు. ఇందులో చలువ పందిళ్లు, విద్యుద్దీపాలంకరణ, భక్తుల మౌలిక సదుపాయాలు, రంగులు, పూల అలంకరణ, ఇతరత్రా ఖర్చులు ఉంటాయి. కాగా శ్రీరామనవమి సమయాన వినియోగించే ముత్యాల తలంబ్రాలకు అయ్యే ఖర్చే రూ.80లక్షల వరకు ఉంటోందని దేవస్థానం వర్గాలు పేర్కొంటున్నాయి. అలాగే అధికార యంత్రాంగం ఖర్చుల్లో దేవస్థానం వాటాగా చెల్లించాల్సిన మొత్తం సైతం రూ.20లక్షల వరకు ఉంటుంది. ఇదంతా భక్తులు హుండీ, అర్జిత సేవల ద్వారా చెల్లించిన మొత్తాల నుంచి వెచ్చించాల్సిన పరిస్థితి ఉంది. వైకుంఠ ఏకాదశి మహోత్సవాలకు సుమారు రూ.2కోట్ల వరకు వ్యయమవుతోంది.

లాంఛనాలకు రూ.లక్ష ఇచ్చేదెప్పుడో?

దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించే శ్రీరామనవమికి తానీషా కాలం నుంచి వస్తున్న సంప్రదాయంలో భాగంగా ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలను ముఖ్యమంత్రి సమర్పిస్తారు. అయితే ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి ప్రభుత్వాలు వీటికోసం రూ.15వేలు కేటాయించగా, అదే ఇప్పటికీ కొనసాగుతోంది. మూడు దశాబ్దాల అనంతరం ఖర్చులు పెరగడంతో లాంఛనాలకు రూ.లక్ష పెంపునకు ప్రతిపాదనలు పంపాలని 2020మార్చిలో దేవాదాయ శాఖ కమిషనర్ దేవస్థానం అధికారులను ఆదేశించారు. దాంతో 24 గంటల్లోనే కమిషనర్ కార్యాలయానికి ప్రతిపాదనలు వెళ్లినా ఇప్పటికీ నోచుకోకపోవడం గమనార్హం.

ఉమ్మడి రాష్ట్రంలోనే ప్రతిపాదనలు

గతంలో ఉమ్మడి రాష్ట్ర హయాంలోనే అప్పటి దేవస్థానం పాలకమండలి భద్రాద్రి దేవస్థానానికి ఉత్సవాల నిర్వహణ భారమవుతోందని, ఇందుకు ప్రభుత్వమే ప్రతిఏటా నిధులు కేటాయించాలంటూ తీర్మానించింది. ఇందుకు సంబంధించిన తీర్మానాన్ని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వానికి సైతం పంపింది. అయితే ఆ తరువాత జరిగిన పరిణామాలతో రాష్ట్ర విభజన, నూతన ప్రభుత్వం ఏర్పడటంతో ఇది అమలుకు నోచుకోలేదు. నేడు మళ్లీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిననేపథ్యంలో ఈ ప్రభుత్వమైనా భద్రాద్రి దేవస్థానానికి శ్రీరామనవమి, వైకుంఠ ఏకాదశి నిర్వహణ భారం లేకుండా ప్రతి ఏటా రూ.5కోట్లు మంజూరు చేయాలని భక్తులు, భద్రాద్రివాసులు కోరుతున్నారు. ఇదిలా ఉండగా ఉత్సవాల నిర్వహణకు నిధులు కేటాయించాలని దేవస్థానం అధికారులు ప్రభుత్వాన్ని కోరే యోచనలో ఉన్నట్లు సమాచారం.



విద్యాశాఖ అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ గౌతమ్

టెన్త్, ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు

అధికారులతో కలెక్టర్ వీపీ గౌతమ్ సమీక్ష

4



శిలాఫలకాలు ఆవిష్కరించిన ఎమ్మెల్యే జారె

ఆర్‌వోబీ, ఆర్‌యూబీల కల సాకారం

వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని మోదీ

4



కలెక్టరేట్ వద్ద ధర్నా

కార్పొరేట్‌కు వ్యవసాయ రంగం తాకట్టు

- రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భాగం హేమంతరావు
- కలెక్టరేట్ ఎదుట రైతులతో నిరసన

ఖమ్మం సంక్షేమవిభాగం, ఫిబ్రవరి 26: కార్పొరేట్‌కు వ్యవసాయ రంగాన్ని తాకట్టు పెట్టే విధంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ అనుకూలంగా వ్యవసాయ చట్టాలను మార్పులు చేస్తోందని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు భాగం హేమంతరావు విమర్శించారు. తెలంగాణ రైతు సంఘం పిలుపుమేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట రైతులతో కలిసి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా భాగం హేమంతరావు మాట్లాడుతూ గతంలో ఢిల్లీలో రైతులు నిరసన కార్యక్రమాలు చేపట్టి ప్రాణత్యాగాలు చేశారని ఆ నాడు రైతుల నిరసనలకు తలొగ్గిన మోదీ మూడు వ్యవసాయ చట్టాలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించి ఇప్పుడు దొడ్డిదారిన మళ్లీ బయటకు తీసుకొచ్చేందుకు చూస్తున్నారని ఆరోపించారు. సీపీఐ జిల్లా సమితి కార్యదర్శి పోటు ప్రసాద్, శింగు నర్సింహారావు, ఆజ్మీర రాంమూర్తి, యర్రా బాబు, తాటి నిర్మల, గాదె లక్ష్మీనారాయణ, ఇటికాల రామకృష్ణ పాల్గొన్నారు.

పత్తి కొనుగోలు కేంద్రాల
కొనసాగింపు

మంత్రి తుమ్మల లేఖకు సీసీఐ సానుకూల స్పందన

వరంగల్ టౌన్, ఫిబ్రవరి 26: రైతులు పండించిన పత్తి పూర్తిగా మార్కెట్లకు రాకపోవడంతో సీసీఐ కొనుగోలు కేంద్రాలను కొనసాగించాలని నిర్ణయించింది. పత్తి రైతుల వినతి మేరకు సీసీఐ కేంద్రాలను కొనసాగించాలని కోరుతూ ఇటీవల వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) కు లేఖ రాశారు. పత్తి రావడం మందగించడంతో సీసీఐ పత్తి కొనుగోళ్లను నిలిపివేస్తుందని ప్రచారం జరిగిన నేపథ్యంలో ఆయన ఈ సూచన చేశారు. మరోవైపు పత్తి కొనుగోళ్లను మరింత వేగవంతం చేయాలని మార్కెటింగ్‌శాఖ అధికారులను ఆదేశించారు. రైతుల వద్ద ఇంకా 15నుంచి 20శాతం వరకు పత్తి నిల్వ ఉంది. గతేడాది ఇదే సమయంలో పత్తి ధరలు పుంజుకోవడంతో అనేకమంది రైతులు వేచి చూసే ధోరణిలో ఉన్నారు. రైతులకు మేలు చేసేందుకు మంత్రి తుమ్మల రాసిన లేఖను పరిగణనలోకి తీసుకున్న సీసీఐ కొనుగోలు కేంద్రాలను కొనసాగించాలని నిర్ణయం తీసుకుంది. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పత్తిని విక్రయించుకోవాలని మార్కెటింగ్‌శాఖ అధికారులు కోరుతున్నారు.



వి.వెంకటాయపాలెం రైతువేదికలో వీడియో కాన్ఫరెన్సు ట్రయల్‌రన్ పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

రైతుల్లో అవగాహన కోసం..

- రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ సౌకర్యం
- నియోజకవర్గానికి ఒకచోట మోడల్‌గా ఎంపిక
- పలుచోట్ల విజయవంతంగా ట్రయల్ రన్
- శాస్త్రవేత్తలతో నేరుగా మాట్లాడే సౌలభ్యం
- త్వరలో అన్ని వేదికలకూ విస్తరణ

4

అందుబాటులోకి ఆర్‌వోబీ, ఆర్‌యూబీలు

- వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని మోదీ
- శిలాఫలకాలు ఆవిష్కరించిన ఎమ్మెల్యే, జడ్పీ చైర్మన్

అన్నపురెడ్డిపల్లి/ మధిర రూరల్, ఫిబ్రవరి 26: రైల్వే బ్రిడ్జీలతో ప్రయాణం సులభతరం అవుతుందని ఖమ్మం జడ్పీచైర్మన్ లింగాల కమల్‌రాజు, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అన్నారు. అన్నపురెడ్డిపల్లి మండల పరిధిలో శాంతినగర్ వద్ద నిర్మించిన రైల్వే రోడ్డు ఓవర్ బ్రిడ్జిని, మధిర మండలంలో కేంద్రప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్మించిన మూడు గ్రామాల్లో రైల్వే అండర్‌బ్రిడ్జ్‌లను సోమవారం ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా ఢిల్లీ నుంచి ప్రారంభించారు. ఈ సందర్భంగా వంతెనల వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకాలను ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, జడ్పీచైర్మన్ లింగాల ఆయా ప్రాంతాల్లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ. 93 కోట్లతో నిర్మించిన వంతెనవల్ల ట్రాఫిక్ సమస్యలు ఉండవని తెలిపారు. అనంతరం రైల్వే వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

బయ్యారం గ్రామంలోని రైల్వే అండర్‌బ్రిడ్జిని రైల్వేశాఖ ఏడీఆర్‌ఎం శ్రీనివాస్, దెందుకూరు అండర్‌బ్రిడ్జిని రైల్వే సీనియర్ ఇంజనీర్ రామకృష్ణ, తొర్లపాడులోని అండర్‌బ్రిడ్జిని జడ్పీచైర్మన్ లింగాల కమల్‌రాజ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో మధిర మునిసిపల్ చైర్‌పర్సన్ మొండితోక లత, మాజీ సర్పంచ్‌లు కోట విజయశాంతి, పింగళి శిరీష, పలు రాజకీయ పక్షాల నాయకులు సూరంశెట్టి కిషోర్, గుర్రం రామారావు, అయితం ప్రసాద్, ప్రసాద్, పింగళి రామిరెడ్డి, అంథోని తదితరులు, కొవూరు రైల్వే సాధన కమిటీ కన్వీనర్ పాండురంగాచారి, టీడీసీఆర్ చీఫ్ కమర్షియల్ అధికారి జేమ్స్‌పాల్, ఆర్‌అండ్‌బీ ఈఈ వెంకటేశ్వరావు, తహసీల్దార్ జగదీశ్వరప్రసాద్, నాయకులు వర్సా వెంకటేశ్వరావు, వేముల రమణ పాల్గొన్నారు.

ఉత్సాహంగా కేపీఎల్ క్రికెట్ పోటీలు

ఖమ్మం స్పోర్ట్స్, ఫిబ్రవరి 26: నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జరుగుతున్న ఖమ్మం ప్రీమియర్ లీగ్ టీ-20 క్రికెట్ పోటీలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. ఐదవ రోజు పోటీలను టీడీపీ ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ కూరపాటి వెంకటేశ్వర్లు క్రీడాకారులను పరిచయం చేసుకొని ప్రారంభించారు. సోమవారం జరిగిన పూల్-బి లీగ్ పోటీలో అభయ అవెంజర్స్ జట్టుపై సి-స్టార్ స్పార్టన్ జట్టు విజయం సాధించింది. మ్యాచ్‌లో మ్యాచ్‌లో మొదటగా బ్యాటింగ్ చేసిన అభయ అవెంజర్స్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 10 వికెట్లు నష్టానికి 154 పరుగులు చేయగా అనంతరం చేజింగ్‌కు దిగిన సి-స్టార్ స్పార్టన్ జట్టు 18.5 ఓవర్లలో 5వికెట్లు కోల్పోయి 158 పరుగులు చేసి విజయం సాధించింది. పోటీలను టోర్నీ ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ కూరపాటి ప్రదీప్‌కుమార్, వేముల వెంకట్, బాబాల లక్ష్మణ్, మతిన్, నరాల నరేష్, శ్రీకాంత్, ఓలేటి సాంబమూర్తి తదితరులు సమీక్షించారు.

ఖమ్మం జిల్లా కబడ్డీ జట్టు సిద్ధం

ఖమ్మం స్పోర్ట్స్, ఫిబ్రవరి 26: నాగార్జున సాగర్‌లో మార్చి 2 నుంచి 4 వరకు జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలలో పాల్గొనే జిల్లా సీనియర్ పురుషుల కబడ్డీ జట్టును ఆదివారం నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో ఎంపిక చేశారు. ఎంపికల్లో జిల్లా వ్యాప్తంగా సుమారు 79 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారుల వివరాలను జిల్లా కబడ్డీ అసోసియేషన్ సెక్రెటరీ క్రిష్టపర్‌బాబు ప్రకటించారు. జట్టులో ఆజాద్, రమేష్, అఖిల్, యశ్వత్, వినోద్, అనిల్, రామ్మక్రిష్ణ, అనిల్‌కుమార్, సాయికుమార్, అజయ్, రాజ్‌కుమార్, శివనాగరాజు, ప్రవీణ్‌కుమార్, నవీన్, వినయ్‌రాజా, కుమార్‌గోపి, అశోక్, సంపత్, నాగరాజులు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ఎంపికైన క్రీడాకారులకు మార్చి ఒకటో తేదీ నుంచి సర్దార్ పటేల్ స్టేడియంలో శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

అంగన్‌వాడీ భవనం శిథిలమైంది..

రైతువేదిక రక్షణగా మారింది

బోనకల్, ఫిబ్రవరి 26: చిన్నారులకు ఆలనా పాలనతో పాటు పౌష్టికాహారం అందించే అంగన్‌వాడీ కేంద్ర భవనం ఏళ్ల తరబడి శిథిలావస్థలో ఉన్నా పట్టించుకున్నా నాథుడే కరువయ్యారు. ఒకటి కాదు రెండు కాదు పదుల సంఖ్యలో గ్రామం నుంచి రాష్ట్ర స్థాయి అధికారుల వరకు ఫిర్యాదు చేశారు. ఫలితం మాత్రం లేకపోవడంతో కూలిపోయే భవనంలో పిల్లలను కూర్చోబెడితే ప్రమా దం తప్పదని భావించిన తల్లిదండ్రులు, ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు అంగన్‌వాడీ కేంద్రాన్ని రైతువేదికలోకి మార్చిన సంఘ టన బోనకల్ మండలం గోవిందాపురం(ఎ) గ్రామంలో జరిగింది. గ్రామంలో గల ప్రాథమిక పాఠశాల ఆవరణలో అంగన్‌వాడీ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. ఈ అంగన్‌వాడీలో 15 మంది పిల్లలు విద్యనభ్యసిస్తున్నారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారాన్ని అందిం చడంతో పాటు పలు సేవలను అందిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్ర భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో స్లాబ్‌పై పెచ్చులు ఊడి పడుతున్నాయి. అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే పౌష్టికాహారాన్ని భద్రంగా ఉంచడం కష్టతరంగా మారింది. భవనం ఎప్పుడు కూలిపోతుందోనన్న భయంతో పిల్లల తల్లిదండ్రులు, ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు సమష్టిగా నిర్ణయం తీసుకున్నారు. బాలినేని విమల, బాగం నాయుడుల జ్ఞాపకా ర్థం రూ.4లక్షల వ్యయంతో బాగం నాగేశ్వరరావు నిర్మించిన రైతువేదిక భవనంలోకి అంగన్‌వాడీ కేంద్రాన్ని మార్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పారా శ్రీదేవి, పారా వెంకటమోహన్‌రావు, బాగం నాగేశ్వరావు, తోటకూర వెంకటేశ్వరావు, బాగం పాపారావు, మలాది లింగయ్య రాయప్ప తదితరులు పాల్గొన్నారు.



పిల్లలను రైతువేదిక భవనంలోకి మార్చిన ప్రజా ప్రతినిధులు

అశ్వాపురం వైస్ ఎంపీపీపై నెగ్గిన అవిశ్వాసం



అవిశ్వాస తీర్మానంలో పాల్గొన్న ఎంపీటీసీ సభ్యులు

అశ్వాపురం ఫిబ్రవరి 26: బీఆర్ఎస్ పార్టీకి చెందిన అశ్వాపురం వైస్ ఎంపీపీ కంచుగట్ల వీరభద్రంపై కాంగ్రెస్, టీడీపీ ఎంపీటీసీలు ఇచ్చిన అవిశ్వాసం నెగ్గింది. వైస్ ఎంపీపీపై అవిశ్వాసానికి సంబంధించి జనవరి30న భద్రాచలం ఆర్డీవో మంగీలాల్‌కు ఎంపీటీసీలు తీర్మానం అందజేశారు. ఈమేరకు ఆర్డీవో సోమవారం అశ్వాపురం రైతువేదిక కార్యాలయంలో అవిశ్వాస సమావేశం ఏర్పాటు చేశారు. మొత్తం 12 మంది ఎంపీటీసీలకు గాను 8 మంది ఎంపీటీ సీలు సమావేశానికి హాజరు కావటంతో ఇన్‌చార్జి ఆర్డీవో సుమ ఆధ్వర్యంలో అవిశ్వాస ఓటింగ్ నిర్వహించారు. దీంతో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎంపీపీ ముత్తినేని సుజాత, ఎంపీటీసీలు కమటం నరేష్, కొమరం చిట్టిమ్మ, కొర్సా ముత్తయ్య, గాదె జయ, బేతం రామకృష్ణ, ఏనిక రవి, తుళ్లూరి గంగాభవానీలు అవిశ్వాసానికి మద్దతుగా చేతులెత్తడంతో అవిశ్వాసం నెగ్గినట్లు ఆమె ప్రకటించారు. కాగా అవిశ్వాస సమావేశం ముగింపు దశలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన తుమ్మలచెరువు ఎంపీటీసీ తాటి పూజిత సమావేశానికి హాజరై అవిశ్వాసానికి మద్దతు తెలపటం విశేషం. అవిశ్వాసానికి సంబంధించి తీర్మానాన్ని పంచాయతీరాజ్ కమిషనర్‌కు పంపనున్నట్లు తెలిపారు. ఉన్నతాధికారుల ప్రకారం.. వైస్ ఎంపీపీ ఎన్నిక నిర్వహించనున్నట్లు అధికారి సుమ తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ స్వర్ణ, ఎంపీడీవో వరప్రసాద్‌లు పాల్గొన్నారు.

హామీలను విస్మరించిన కాంగ్రెస్

- గత ప్రభుత్వ అవినీతిపై సీఎం లేఖ ఇస్తే సీబీఐ విచారణ జరిపిస్తాం
- బీజేపీ శాసనసభాపక్ష నేత, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి
- దమ్మపేట, సత్తుపల్లిలో బీజేపీ విజయ సంకల్ప యాత్ర

కొత్తగూడెం(ఆంధ్రజ్యోతి), దమ్మపేట/ సత్తుపల్లి/ వైరా/ మధిర, ఫిబ్రవరి26: అబద్ధాల పునాదుల మీద కాంగ్రెస్ నిర్మాణం జరిగిందని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక వారి సహజ శైలితోనే ప్రజలకు ఇచ్చి హామీలను గాలికి వదిలేశారని బీజేపీ శాసనసభాపక్ష నాయకుడు, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు. సోమవారం దమ్మపేట, సత్తుపల్లి, వైరా, మధిరలోజరిగిన బీజేపీ విజయ సంకల్ప యాత్రలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో 412హామీలు ఇచ్చిందని, ఏ ఒక్కహామీ ఇప్పటి వరకు అమలు చేయలేదని ఆరోపించారు. డిసెంబర్ 9నే రూ.2లక్షల రైతు రుణమాఫీ చేస్తామని చెప్పిన కాంగ్రెస్ మాట తప్పిందన్నారు. మహిళలకు రూ.2500, నిరుద్యోగ భృతి, పెన్షన్ రూ.4వేల చొప్పున ప్రకటించి ఇంతవరకు అమలు చేయలేదని, నిరుద్యోగ భృతి గురించి అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తే అసలు హామీనే ఇవ్వలేదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అసెంబ్లీలో అబద్ధం చెప్పారని అన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అన్నీ అమలు చేయడానికి రూ.3.50లక్షల కోట్ల నుంచి రూ.5లక్షల కోట్ల వరకు ఖర్చు అవుతుందని, కానీ బడ్జెట్‌లో రూ.53వేల కోట్ల మాత్రమే ప్రవేశ పెట్టారని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి తానా అంటే ఈ ప్రాంతానికి చెందిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తందాన అంటూ వంతపాడుతున్నారని విమర్శించారు.

బీఆర్ఎస్ అవినీతిపై సీఎం రేవంత్ రెడ్డి సీబీఐ విచారణకు లేఖ ఇస్తే 48గంటల్లో విచారణకు ఆదేశిస్తామన్నారు. ఖమ్మం జిల్లాకు ముగ్గురు మంత్రులు ఉన్నా కాంగ్రెస్ ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు కావడం లేదని విమర్శించారు. ఇదే పరిస్థితి మరో ఆరు నెలలు కొనసాగితే కాంగ్రెస్ ఎమ్మెల్యేలను ప్రజలు గ్రామాల్లోకి రాకుండా తరిమికొడతారని హెచ్చరించారు. కమ్యూనిస్టులను బీఆర్ఎస్, కాంగ్రెస్‌లను చూసిన ప్రజలు ఒక్కసారి భారతీయ జనతా పార్టీకి అవకాశం ఇవ్వాలని, తద్వారా రామరాజ్యం స్థాపన జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, రంగా కిరణ్, గెల్లా సత్యనారాయణ, నంబూరి రామలింగేశ్వరరావు, తాండ్ర వినోదరావు, గొంగూర వెంకటేశ్వర్లు, శ్రీకాంత్, దాడా శ్రీనివాసరెడ్డి, బైరెడ్డి, ప్రభాకర్, తిరుమలరెడ్డి, ఈవీ రమేష్, దేవకీ వాసుదేవరావు, పాలకొల్లు శ్రీను, భాస్కర్ల వీరంరాజు, నాయుడు రామవరావు, సున్నా మిత్రా, ఆచంట నాగస్వామి, రహ్మతుల్లా పాల్గొన్నారు.

బీజేపీ జెండా ఎగురడం ఖాయం



త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఖమ్మం స్థానంలో బీజేపీ జెండా ఎగురడం ఖాయమని బీజేపీ ఫ్లోర్ లీడర్, నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి ఉద్ఘాటించారు. కొత్తగూడెంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో గెలిచినప్పటికీ కేంద్రంలో గెలిచే అవకాశాలు లేవని జోస్యం చెప్పారు. జిల్లాకు చెందిన మంత్రులు ఇచ్చిన హామీలను గాలికొదిలేశారని విమర్శించారు. ఆర్థిక శాఖ మంత్రి మల్లుభట్టి విక్రమార్క, దళితబంధుకు బడ్జెట్‌లో ఎటువంటి కేటాయింపులు చేయకుండా దళితులను మోసం చేశారని ధ్వజమెత్తారు. పేదలకు ఇంటి స్థలాన్ని ఉచితంగా ఇస్తామన్న రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అతీసే ఎత్తడం లేదన్నారు. కృష్ణజలాల విషయంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావుపై విమర్శలు చేశారు. ప్రజలు ఆశీర్వదించి మరోసారి మోదీని గెలిపించాలని, బీజేపీతోనే రామరాజ్యం నెలకొంటుందన్నారు.



మహేశ్వర్‌రెడ్డిని సన్మానిస్తున్న సత్తుపల్లి బీజేపీ నాయకులు

రైతుల్లో అవగాహన కోసం..

- రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ సౌకర్యం
- నియోజకవర్గానికి ఒకచోట మోడల్‌గా ఎంపిక
- పలుచోట్ల విజయవంతంగా ట్రయల్ రన్
- శాస్త్రవేత్తలతో నేరుగా మాట్లాడే సౌలభ్యం

ఖమ్మం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): సమగ్ర వ్యవసాయంపై రైతుల్లో అవగాహన పెంచేందుకు నేరుగా రైతులతోనే మాట్లాడేందుకు రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్సు సదుపాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం దశల వారీగా సమకూర్చుబోతోంది. అందులో మోడల్‌గా నియోజకవర్గానికి ఒక రైతు వేదికను ఎంపిక చేసి వీడియో కాన్ఫరెన్సు పరికరాలను సమకూర్చారు. సోమవారం పలుచోట్ల ట్రయల్‌రన్ నిర్వహించారు.

ఉమ్మడి జిల్లాలో పది నియోజకవర్గాల్లో పది రైతు వేదికలను ఎంపిక చేసి ఎల్ఈడీ టీవీలతోపాటు సీసీ కెమెరాలను ఇతర సదుపాయాలను ఏర్పాటు చేశారు. జిల్లాలో ఖమ్మం నియోజకవర్గంలోని రఘునాథపాలెం మండలం వీవెంకటాయపాలెం, పాలేరు నియోజకవర్గంలోని కూసుమంచి, వైరా నియోజకవర్గంలోని కొణిజర్ల మండలం తనికెళ్ల, మధిర నియోజకవర్గంలోని బోనకల్, సత్తుపల్లి నియోజకవర్గంలోని కల్లూరు మండలం కొర్లగూడెంలో రైతు వేదికల్లో ట్రయల్ రన్ నిర్వహించారు. భద్రాద్రి జిల్లాలో కూడా ఐదు నియోజకవర్గాల్లో ఐదు రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్సు పరికరాలను సమకూర్చారు. కొత్తగూడెం నియోజకవర్గంలోని మండల కేంద్రం లక్ష్మీదేవిపల్లి, పినపాక నియోజకవర్గంలోని మండల కేంద్రం బూర్గంపాడు, ఇల్లెందు నియోజకవర్గంలోని టేకులపల్లి మండలం కోయగూడెం, భద్రాచలం నియోజకవర్గంలోని మండల కేంద్రం చర్ల, అశ్వారావుపేట నియోజకవర్గంలోని ములకలపల్లిలో ట్రయల్‌రన్ నిర్వహించారు.

త్వరలో దశలవారీగా మిగిలిన రైతు వేదికల్లోనూ ఈ వీడియో కాన్ఫరెన్సు సదుపాయాలు సమకూర్చబోతున్నారు. వీటి ద్వారా ఆయా గ్రామాల రైతులకు అగ్రికల్చర్, హార్టికల్చర్, సెరికల్చర్, ఆయిల్‌పామ్ అధికారులతోపాటు ఆదర్శ రైతులతోనూ రాష్ట్రంలో ఇతర రాష్ట్రాల్లో పంటల సాగు పరిస్థితులు, మెళకువలు, కొత్త రకం పంటల గురించి తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడలు, రైతులు పండించిన పంటలను వ్యవసాయ అనుబంధ పరిశ్రమల ఏర్పాటు, ఎగుమతులపైనా, చీడపీడల నివారణకు శాస్త్రవేత్తలతో నేరుగా ముఖాముఖి తదితర సౌకర్యాలు పెంచబోతున్నారు.

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన జిల్లాకు చెందిన తుమ్మల నాగేశ్వరరావు రైతువేదికల ద్వారా రైతాంగానికి సమగ్ర వ్యవసాయ సాగు విధానంతోపాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వ్యవసాయ పథకాల గురించి వ్యవసాయ రంగంలో రోజురోజుకు వస్తున్న మార్పులు, దేశీ, విదేశీ పరిజ్ఞానం, లాభసాటి వ్యవసాయంపై రైతుల్లో చైతన్యం పెంచేందుకు రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్సు ఏర్పాటుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. దశలవారీగా ఇతర రైతువేదికల్లోనూ కార్యక్రమం విస్తరించబోతుంది.



వీడియోకాన్ఫరెన్స్ ట్రయల్‌రన్ చూస్తున్న వ్యవసాయ అధికారులు

విద్యతో పాటు వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలి

- రాష్ట్రస్థాయి బాలోత్సవ్‌లో ఎమ్మెల్యే కూనంనేని



జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

కొత్తగూడెం పోస్టాఫీసు సెంటర్, ఫిబ్రవరి 26: విద్యతో పాటు ఉన్నత వ్యక్తిత్వ వికాసం పెంపొందించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. కొత్తగూడెం సీఈఆర్ క్లబ్బులో మూడు రోజుల పాటు ప్రారంభమైన 6వ తెలంగాణ బాలోత్సవ్‌ను సోమవారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వెనుకటి రోజుల్లో గురుకులాల్లో మంచి విద్యాబోధన జరిగేదని, నేటి రోజుల్లో విద్య ఆధునిక పోకడలతో అస్తవ్యస్తంగా తయారైందన్నారు. బాలోత్సవ్ నిర్వహిస్తూ విద్యార్థులను ప్రోత్సహిస్తున్న మద్దెల శివకుమార్‌తో పాటు కమిటీ సభ్యులు అభినందనీయులన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్‌పాషా, జాతీయ ట్రేడ్ యూనియన్ నాయకులు గొల్లపల్లి దయానంద్, బాలోత్సవ్ నిర్వాహకులు మద్దెల శివకుమార్, కమిటీ సభ్యులు అల్లి శంకర్, ధనరాజ్, స్టీఫెన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

46 బీఎస్ఎన్ఎల్ టవర్ల ఏర్పాటు

ఆళ్లపల్లి, ఫిబ్రవరి 26: కేంద్ర ప్రభుత్వం సహకారంతో బీఎస్ఎన్ఎల్ సంస్థ ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లోని నక్సల్ ప్రభావిత, గిరిజన గ్రామాల్లో 4జీ సేవలతో బీఎస్ఎన్ఎల్ టవర్లు ఏర్పాటు చేస్తోంది. టవర్ల పనులు 70శాతం పూర్తి కావచ్చాయి. ఆయా టవర్లకు విద్యుత్ సౌకర్యంతో పాటు వర్షకాలం అడవి ప్రాంతాల్లో విద్యుత్ సమస్య ఎక్కువగా ఉండే అవకాశం ఉండటంతో టెలికం కమ్యూనికేషన్ దూరం కావద్దన్న ఉద్దేశ్యంతో అధికారులు జనరేటర్, సోలార్ విద్యుత్ కూడా ఏర్పాటు చేస్తున్నారు. టవర్లు అందుబాటులోకి వస్తే గ్రామాల్లో ఇంటర్నెట్ విద్యావ్యవస్థ, వైద్య సదుపాయం, ఉద్యోగ అవకా శాలు, పంచాయతీ అభివృద్ధి, ఇతర సమాచారం పొందడంతో పాటు అనేక ప్రయోజనాలు గిరిజన గ్రామాలకు అందుబాటులోకి రానున్నాయి. ఆరునెలల్లో బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలు అందించేందుకు కసరత్తు చేస్తున్నట్టు బీఎస్ఎన్ఎల్ ఏజీఎం సుధీర్ తెలిపారు.

మార్కెట్ అసిస్టెంట్ సెక్రెటరీగా ఆంజనేయులు



ఖమ్మం మార్కెట్, ఫిబ్రవరి 26: ఖమ్మం నగరంలోని వ్యవసాయ మార్కెట్ అసిస్టెంట్ సెక్రెటరీగా పోలవరపు అంజనేయులు నియమితులయ్యారు. సోమవారం ఖమ్మం మార్కెట్ కార్యాలయంలో భాధ్యతలు స్వీకరించారు. గతంలో మద్దులపల్లి మార్కెట్ సీనియర్ సూపర్‌వైజర్‌గా ఉంటూ ఇన్‌చార్జ్ సెక్రెటరీగా బాధ్యతలు నిర్వర్తించిన ఆయనకు శనివారం రాష్ట్ర మార్కెటింగ్ శాఖ అసిస్టెంట్ సెక్రెటరీగా పదోన్నతి కల్పించి ఖమ్మం మార్కెట్‌కు బదిలీ కాకుండా ఖమ్మం మార్కెట్‌లో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న వాసాల వెంకటేశ్వర్లు సైతం అసిస్టెంట్ సెక్రెటరీగా పదోన్నతి పొంది వైరా వ్యవసాయ మార్కెట్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఖమ్మం మార్కెట్‌కు అసిస్టెంట్ సెక్రెటరీగా నియమితులైన ఆంజనేయులును మార్కెట్ సెక్రెటరీ ప్రవీణ్‌రెడ్డి, గ్రేడ్-2 సెక్రెటరీ బజారు, మార్కెటింగ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు తాడేపల్లి కిరణ్ కుమార్, ఇ. నరేష్ తదితరులు అభినందించారు.

టెన్త్, ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

ఖమ్మం కలెక్టరేట్, ఫిబ్రవరి 26: పదో తరగతి, ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్ అధికారులను ఆదేశించారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలపై విద్యాశాఖతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులతో సోమవారం కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా కోఆర్డినేషన్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 28 నుంచి మార్చి 19 వరకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఇంటర్మీడియట్ పరీక్షలు జరగనున్నాయని, జిల్లాలో మొత్తం 70 పరీక్షా కేంద్రాలలో 36,578 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. మార్చి 18 నుండి ఏప్రిల్ 2 వరకు ఉదయం 9:30 గంటల నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పదో తరగతి పరీక్షలు జరగనున్నాయని, దీనికోసం జిల్లాలో 97 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ప్రతి కేంద్రంలో సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు కొనసాగుతాయని, ఎటువంటి మాల్ ప్రాక్టీస్‌కు అవకాశం లేకుండా పకడ్బందిగా నిర్వహించాలన్నారు. స్మార్ట్ ఫోన్లు, మొబైల్స్, స్మార్ట్ వాచీలు ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు పరీక్షా కేంద్రాలలో అనుమతించరాదన్నారు. సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు.

పటిష్ట బందోబస్తు మధ్యన ప్రశ్న, జవాబు పత్రాలను సంబంధిత కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. పరీక్షా సమయాలలో జిరాక్స్ కేంద్రాలను మూసివేయాలని, కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. సమస్యాత్మక కేంద్రాలలో అదనపు పోలీసు బలగాలను ఏర్పాటుచేయాలని పోలీస్ అధికారులకు సూచించారు.

ఈ సమీక్షా సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రవిబాబు, డీఈవో సోమశేఖరశర్మ, డీఎంహెచ్‌వో డా.సుబ్బారావు, విద్యుత్ శాఖ ఎస్ఈ సురేందర్, జడ్పీ సీఈవో వినోద్, డీపీవో ప్రభాకర్, ఏసీపీ సాంబయ్య, వైరా, సత్తుపల్లి మున్సిపల్ కమిషనర్లు సి.హెచ్.వేణు, రవిబాబు, పోస్టల్ శాఖ సూపరింటెండెంట్ బి.రవికుమార్, ఆర్టీసీ డివిజనల్ మేనేజర్, జిల్లా కోశాధికారి సత్యనారాయణ, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు ప్రత్యేక బస్సులు

ఖమ్మం ఖానాపురం హవేలి: ఈ నెల 28 నుంచి మార్చి 19 వరకు ఇంటర్మీడియట్ బోర్డు వార్షిక పరీక్షలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఆర్టీసీ విద్యార్థులకు రవాణా ఏర్పాట్లను చేస్తుందని రీజనల్ మేనేజర్ సీహెచ్ వెంకన్న తెలిపారు. బస్‌పాస్ కలిగిన విద్యార్థులు హాల్ టికెట్ పై ఉన్న పరీక్ష కేంద్రానికి ఉచితంగా ప్రయాణం చేయవచ్చని, బస్‌పాస్ లేని విద్యార్థుల నుంచి సాధారణ చార్జీలు వసూలు చేయబడతాయని, బస్‌పాస్ గల విద్యార్థులు, కాంబినేషన్ టికెట్ తీసుకోవడం ద్వారా ఎక్స్‌ప్రెస్ బస్సులలో కూడా పరీక్ష కేంద్రానికి ప్రయాణం చేయవచ్చునని తెలిపారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా విద్యార్థినులు ఎటువంటి బస్‌పాస్ లేకున్నా, పల్లె వెలుగు ఎక్స్‌ప్రెస్ బస్సులలో ఉచితంగా ప్రయాణం చేయవచ్చునని తెలిపారు. ఇతర వివరాల కోసం ఖమ్మం నూతన బస్టాండ్ 99592 25979, ఖమ్మం ఓల్డ్ బస్టాండ్ 99592 25965, సత్తుపల్లి 99592 25990, మణుగూరు 89853 61796, కొత్తగూడెం 99592 25982, మధిర 73829 25289, భద్రాచలం 99592 25987, ఇల్లెందు 99592 25984 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

చేగొమ్మ సొసైటీ అధ్యక్షుడు

ఇంటూరి రాజీనామా

కూసుమంచి, ఫిబ్రవరి 16: కూసుమంచి మండలం చేగొమ్మ సహకారసంఘం అధ్యక్షుడు, డీసీసీబీ డైరెక్టర్ ఇంటూరి శేఖర్ తన పదవికి రాజీనామా చేశారు. ఈమేరకు జిల్లా సహకార అధికారికి పంపిచగా వెంటనే ఆమోదించారు. ఇటీవల ఈనెల 15తేదీన శేఖర్‌పై తమకు నమ్మకం లేదని, విశ్వాసం కోల్పోయామని తెలుపుతూ సొసైటీ సభ్యులందరూ అవిశ్వాస తీర్మానం నోటీసులు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈక్రమంలో సమావేశానికి ముందే ఇంటూరి శేఖర్ రాజీనామా చేశారు. దీంతో డీసీవో మురళీధర్‌రావు రాజీనామా ఆమోదించారు. అదేవిధంగా వైస్ చైర్మన్ బడేటి శ్రీనివాసరావుకు చైర్మన్‌గా బాధ్యతలు అప్పగించారు.

ఓపెన్ స్కూల్ తనిఖీ

చుంచుపల్లి, ఫిబ్రవరి 26: ఉమ్మడి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల టాస్(ఓపెన్ స్కూలు) కోఆర్డినేటరు మద్దినేని పాపారావు సోమవారం చుంచుపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ఆకస్మికంగా పర్యటించారు. ఈ క్రమంలో రికార్డులను పరిశీలించి విద్యార్థుల జాబితాను పర్యవేక్షించారు. పరీక్ష ఫీజులు కట్టిన విద్యార్థుల వివరాలను అడి గి తెలుసుకున్నారు.

పోలీసుల అదుపులో లక్కినేని..

- నాలుగు గంటల అనంతరం విడుదల

ఖమ్మం క్రైం, ఫిబ్రవరి 26: విజయవాడలో ప్రెస్‌మీట్ పెట్టేందుకు బయలుదేరిన వైఎస్ఆర్‌టీపీ ఖమ్మం జిల్లా మాజీఅధ్యక్షుడు లక్కినేని సుధీర్‌బాబును సోమవారం ఖమ్మం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షురాలుగా ఉన్న వైఎస్ షర్మిల ఆమె పరిచయం చేసిన సతీష్ అనే వ్యక్తి తనను మోసం చేశారని ఈ నేపథ్యంలో విజయవాడలో ప్రెస్‌మీట్ పెట్టేందుకు బయలుదేరిన ఆయనను ఖమ్మం టు టౌన్ పోలీసులు అరెస్ట్‌చేసి స్టేషన్‌కు తీసుకొచ్చినట్లు ఆరోపించారు. ఆయనను అదుపులో తీసుకున్న టూటౌన్ పోలీసులు సుమారు నాలుగు గంటల తరువాత ఆయనను వదిలిపెట్టినట్లు లక్కినేని తెలిపారు. వైఎస్ షర్మిలను, సతీష్‌ను నమ్మి తాను ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయానని దీంతో వారి వలన రోడ్డున పడాల్సివచ్చిందని, ఏపీ ప్రజలు వారి మాటలు నమ్మి మోసపోవద్దని ఆయన అన్నారు. సతీష్ అనే వ్యక్తి అమెరికా వెళ్లకుండా ఆపాలని, అతడిని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. షర్మిలను ఎండగట్టేందుకు విజయవాడలో తాను విలేకరుల సమావేశం పెట్టేందుకు వెళ్తుండగా పోలీసులు తనను అదుపులోకి తీసుకున్నారని ఆరోపించారు.

28న జిల్లాస్థాయి సైన్స్ ఫేర్: డీఈవో

చంద్రుగొండ, ఫిబ్రవరి 26: అన్నపురెడ్డిపల్లి మండలం ఎర్రగుంట జిల్లా పరిషత్ పాఠశాలలో ఈ నెల 28న జిల్లా స్థాయి సైన్స్ ఫేర్ నిర్వహిస్తున్నట్లు డీఈవో వెంకటేశ్వర చారి తెలిపారు. సోమవారం చంద్రుగొండ జడ్పీ పాఠశాలలో హెచ్ఎంలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సైన్స్ ఫేర్‌తో విద్యార్థుల్లో దాగి ఉన్న సామర్థ్యాన్ని వెలికి తీయవచ్చున్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి26: లారీ ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం సత్తుపల్లి మండలం బుగ్గపాడు గ్రామంలో చోటు చేసుకుంది. బుగ్గపాడు గ్రామానికి చెందిన కల్లూరు దాను (35) గ్రామంలో రోడ్డు పక్కన నడుస్తుండగా సత్తుపల్లి వైపు జామా యిల్ కర్ర లోడుతో వెళ్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో దాను అక్కడికక్కడే మృతి చెందాడు.

దమ్మపేట: అదుపు తప్పి లారీ చెట్టును ఢీకొట్టిన ప్రమాదంలో డ్రైవర్ మృతి చెందగా క్లీనర్ తీవ్రంగా గాయపడిన ఘటన గట్టుగూడెం గ్రామ సమీపంలో సోమవారం జరిగింది. వైజాగ్ నుంచి సత్తుపల్లి వైపు ఐరన్‌లోడ్‌తో వెళ్తున్న లారీ గట్టుగూడెం వద్ద అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీకొట్టిం ది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ ఎండీ. అర్బాజ్ (25) అక్కడికక్కడే మృతి చెందగా, క్లీనర్ ఎండీ జునాయద్ తీవ్రంగా గాయపడ్డాడు.

లొంగిపోయిన మావోయిస్టు కమాండర్

దుమ్ముగూడెం ఫిబ్రవరి 26: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో ఓ మావోయిస్టు లొంగిపోయాడు. మావోయిస్టు పార్టీ పీఎల్‌జీఏ బెటాలియన్ కంపెనీ-2కు కమాండర్‌గా వ్యవహరించిన నగేష్ అలియాస్ ఎర్రా సోమవారం సుక్మా జిల్లా ఎస్పీ కిరణ్ చౌహాన్ ఎదుట లొంగిపోయాడు. అతడు తాడిమెట్ల వద్ద ఐఈడీ పేల్చిన సంఘటనతో పాటు 2010లో 76మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లను మట్టుబెట్టిన సంఘటనలో పాల్గొన్నాడు. అతడిపై రూ.8లక్షల పోలీసు రివార్డు ఉంది. లొంగిపో యిన నగేష్‌కు ఎస్పీ నగదు రివార్డు అందజేశారు.

మట్టిని తరలిస్తున్న వాహనాల పట్టివేత

పెదనల్లబల్లిలో అక్రమంగా మట్టిని తరలిస్తున్న రెండు వాహనాలను రెవెన్యూ సిబ్బంది సోమవారం పట్టుకున్నారు. అనుమతి లేని ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

రహదారి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే


పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావు

దుమ్ముగూడెం, ఫిబ్రవరి 26: కొత్తదంతెనం ఆర్అండ్‌బీ ప్రధాన రహదారి నుంచి తాలిపేరు కాల్వ వరకు రూ.10లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో చేపట్టిన తొమ్మిది వందల మీటర్ల గ్రావెల్ రోడ్డు పనులను ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు సోమవారం ప్రారంభించారు. రహదారి నిర్మాణం వర్షాకాలంలో ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. ఎంపీపీ రేసు లక్ష్మి, జడ్పీటీసీ తెల్లం సీతమ్మ, సొసైటీ డైరక్టర్ కాల్వ పూర్ణయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు సత్యనారాయణమూర్తి, కణితి రాముడు, నాయకులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వానిది నమ్మక ద్రోహమే

- కర్షకుల ఆర్తనాదాలు మోదీకి వినిపించడం లేదా..
- దగా పడుతున్న ప్రతీ రైతు ఉద్యమ ఆయుధమై తిరగబడాలి
- ఢిల్లీ రైతాంగ ఉద్యమానికి యావత్ ప్రజలు అండగా నిలవాలి
- సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్‌పాషా

కొత్తగూడెం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మూడు సాగు చట్టాల రద్దు కోరుతూ జరిగిన రైతాంగ ఉద్యమ సమయంలో రైతులకు ఇచ్చిన హామీని కేంద్రం విస్మరించి మోసం చేసిందని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్‌పాషా అన్నారు. సీపీఐ జాతీయ, రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా దేశ రాజధాని ఢిల్లీలో రైతాంగం నిర్వహిస్తున్న పోరాటానికి సంఘీభావంగా సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉద్యమ సమయంలో రైతులపై పెట్టిన కేసులు ఉపసంహాకరించుకున్నట్లు హామీ


మాట్లాడుతున్న సాబీర్ పాషా

ఇచ్చిన కేంద్రం సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన విధంగా ఆదేశాలు జారీ చేయలేదన్నారు. రైతు ఉద్యమంలో అమరులైన వారి కటుంబాలకు నష్ట పరిహారం విషయంలో కేంద్ర ప్రభుత్వం మీనమేశాలు లెక్కిస్తుందన్నారు. పండించిన పంటలకు మద్దతు ధర చెల్లిస్తామని హామీ ఇచ్చి ఇందుకోసం కమిటీని ఏర్పాటు చేస్తామని కేంద్రం ఇచ్చిన హామీ నెలలు గడుస్తున్నా కమిటీని ఏర్పాటు చేయకుండా మోసం చేశారన్నారు. కార్పోరేట్ శక్తులకు అనుకూలంగా చట్టాలను తీసుకువస్తూ ప్రజలు, కార్మికులు, ఉద్యోగులు, రైతాంగంపై కేంద్రం ముప్పేటదాడికి పూనుకుంటోందని విమర్శించారు. రెండు దఫాల బీజేపీ పాలన పెట్టుబడిదారులకు, సామాన్య మధ్య తరగతి వర్గాలకు ఎలాంటి మేలు చేయలేదని ఆరోపించారు. కొత్త వ్యవసాయ సాగు చట్టాలు పెట్టుబడిదారులను మరింత కుబేరులుగా మార్చే విధంగా రూపొందించానన్నారు. కేంద్రం పాలన అదానీ, అంబానీ లాంటి కుబేరుల కనుసన్నల్లో నడుస్తోందని విమర్శించారు. దేశ సంపదను, కార్మికుల, కర్షకుల శ్రమ శక్తిని కార్పోరేట్ శక్తులకు దోచిపెడుతూ దేశాన్ని తిరోగమన బాట పట్టిస్తున్నారని అన్నారు. కేంద్రం చేతిలో దగాపడుతున్న రైతులు ఉద్యమ ఆయుధమై తిరగబడాలని, కేంద్రానికి వ్యతిరేకంగా ఢిల్లీలో రైతాంగం నిర్వహిస్తున్న సుదీర్ఘ పోరాటానికి యావత్ భారత ప్రజలు బాసటగా నిలవాలని పిలుపునిచ్చారు. రైతుల ఆందోళనకు మద్దతుగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు బందెల నర్సయ్య, కల్లూరి



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

వెంకటేశ్వరరావు, ఎస్డీ సలీం, సారయ్య, రావులపల్లి రవికుమార్, వై భాస్కర్‌రావు, దేవరకొండ శంకర్, వి. పూర్ణచందర్ రావు, జి రామకృష్ణ, వాసిరెడ్డి మురళి, భూక్యా దస్రు, గుగులోత్ చందర్, గుండెపిన్ని వెంకటేశ్వర్లు, బంధం నాగయ్య, జి.వీరస్వామి, వట్టికొండ మల్లికార్జున్ రావు, కందుల భాస్కర్, కంచర్ల జమలయ్య, కేశవులు, పద్మజ, కె.రత్నకుమారి, బండి నాగేశ్వరరావు, డి.సుధాకర్, జక్కుల రాములు, నాగుల్‌మీరా, ఎస్.వహీమ్, జడ శ్రీను, షమీమ్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాను అరికట్టండి



మాట్లాడుతున్న కలెక్టర్, హాజరైన అధికారులు

కొత్తగూడెం (ఆంధ్రజ్యోతి), ఫిబ్రవరి 26: జిల్లాలో ఇసుక అక్రమ రవాణాను అరికట్టి ప్రభుత్వ ఆదాయాన్ని పెంచేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ ప్రియాంక అలా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన డిస్ట్రిక్ట్ లెవెల్ శాండ్ కమిటీ సమావేశంలో ఇసుక అక్రమ రవాణా, నియంత్రణ చర్యలు, ప్రభుత్వ ఆదాయాన్ని పెంచే విధంగా తీసుకోవాల్సి చర్యలపై మైనింగ్, ఆర్అండ్‌బీ, ఇరిగేషన్, రెవిన్యూ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని గోదావరి, కిన్నెరసాని నదులకు సంబంధించి మండలాల్లో నిర్వహించబడుతున్న ఇసుక రీచ్‌లలో ఇసుక లభ్యత, నిల్వలపై సంయుక్త తనిఖీలు చేసి శుక్రవారం నాటికి నివేదిక సమర్పించాలన్నారు. ఇసుక లభ్యతను బట్టి కొత్త రీచ్‌ల ఏర్పాటుకు తగిన ప్రదేశాలను గుర్తించాలన్నారు. ఇసుక రీచ్‌ల ద్వారా జిల్లాలో ఇసుక ర్యాంపుల నుంచి నియమ, నిబంధనలకు అనుగుణంగా ఇసుకను విక్రయించాలన్నారు. జీపీఎస్ ట్రాకింగ్ సిస్టం ఏర్పాటు చేయాలని, రీచ్‌లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఇసుక రీచ్‌కు చేరుకోవడానికి ఒకే రహదారి ఉండేలా ట్రెంచ్ ఏర్పాటు చేయాలన్నారు.

వంద శాతం పోలియో చుక్కలు వేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక అల

కొత్తగూడెం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): వంద శాతం పల్స్‌పోలియో చుక్కలు వేయాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల అన్నారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో పల్స్ పోలియో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 3న నేషనల్ ఇమ్యునైజేషన్ డే సందర్భంగా మూడు రోజుల పాటు పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 97,552 మంది ఐదేళ్ల లోపు చిన్నారులు అందరికీ వంద శాతం పల్స్ పోలియో చుక్కలు వేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. ఏదైనా కారణం చేత పల్స్ పోలియో చుక్కలు వేయని మిగిలిన చిన్నారులకు 4,5 తేదీలలో ఇంటింటికీ తిరిగి వ్యాక్సినేషన్ ప్రక్రియను పూర్తిచేయాలని ఆదేశించారు.

'ప్రజావాణి' దరఖాస్తులను పరిష్కరించండి


దరఖాస్తులను స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రియాంక అల

కొత్తగూడెం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో అన్ని శాఖల అధికారులతో ప్రజావాణి నిర్వహించి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ దరఖాస్తు చేసిన అభ్యర్థుల వివరాలను అడిగి తెలుసుకుని పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కోరారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను ఆయా శాఖల అధికారులకు ఎండార్స్ చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో రవీంద్రనాథ్, డీఆర్‌డీఏ పీడీ విద్యాచందన, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్‌లో సత్తాచాటిన కేటీపీఎస్ జట్టు


క్రీడాకారులను అభినందిస్తున్న సీఈ వెంకటేశ్వరరావు

పాల్వంచ, ఫిబ్రవరి 26: ఈ నెల 18 నుంచి 25 వరకు అశ్వాపురం హెవీ వాటర్ ప్లాంట్ వారు నిర్వహించిన ఇండస్ట్రియల్ క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్వంచ కేటీపీఎస్ 7వ దశ క్రీడాకారులు తమ సత్తా చాటారు. సోమవారం 7వ దశ సీఈ చాంబర్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో సీఈ వెంకటేశ్వరరావు క్రీడాకారులను అభినందించారు. ఇండస్ట్రియల్ మీట్‌లో సింగరేణి కాలరీస్, నవభారత్, కేటీపీఎస్ 5,6 దశలు, మణుగూరు బీటీపీఎస్, ఐటీసీ సారపాక, హెవీ వాటర్ ప్లాంట్ జట్లు పాల్గొన్నాయి. ఈ క్రికెట్ టోర్నమెంట్‌లో కేటీపీఎస్ 7వ దశ క్రీడాకారులు నైపుణ్యతను ప్రదర్శించి టోర్నమెంట్ రన్నర్స్ ట్రోఫీని కైవసం చేసుకున్నారు. అత్యుత్తమ ప్రదర్శన కనబరచిన క్రీడాకారులను సీఈ సన్మానించి జ్ఞాపికలను అందజేశారు.ఈ కార్యక్రమంలో డీఈ టెక్నికల్ శేఖర్, గేమ్స్ సెక్రెటరీ వెంకటేశ్వర్లు, ట్రెజరర్ ప్రసాద్, క్రీడాకారులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగించొద్దు



సీసీ టీవీని పరిశీలిస్తున్న డీఎస్పీ రవీందర్‌రెడ్డి

కరకగూడెం, ఫిబ్రవరి 26: మారుమూల ప్రాంతాలలో ప్రజలు శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని మణుగూరు డీఎస్పీ రవీందర్ రెడ్డి హెచ్చరించారు. సోమవారం కరకగూడెం పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నూతన పోలీస్ స్టేషన్ పరిసరాలు పరిశీలించిన ఆయన రికార్డులను పరిశీలించారు. అనంతరం ఎస్ఐ రాజేందర్ ఇక్కడ సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్‌లో, కరకగూడెం రహదారిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనదారులు నిబంధనలు పాటించాలని, చిన్న పిల్లలకు వాహనాలు ఇవ్వవద్దని తెలిపారు. మండలంలో కొత్త వ్యక్తులు అనుమానితులుగా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని.. సమాచారం అందించిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

రేగాకు అస్వస్థత


చికిత్స పొందుతున్న రేగా

మణుగూరుటౌన్, ఫిబ్రవరి 26: పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు సోమవారం అస్వస్థతకు గురయ్యారు. వెంటనే పట్టణంలోని వంద పడకల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో చేరి వైద్య చికిత్సలు పొందుతున్నారు. తీవ్రమైన వంటి నొప్పులతోపాటు జ్వర తీవ్రత ఎక్కువగా ఉందని ఈ సందర్భంగా రేగా ఆంధ్రజ్యోతికి తెలిపారు. రేగాను బీఆర్ఎస్ నాయకులు వట్టం రాంబాబు, యాదగిరిగౌడ్ పరామర్శించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం రేగా హైదరాబాద్‌కు వెళ్లారు.

ధ్వజస్తంభం ఊరేగింపు


కోలాటమాడుతున్న మహిళలు

మణుగూరుటౌన్, ఫిబ్రవరి 26: మణుగూరు మండల పరిధిలోని సమితిసింగారం ప్రధాన రహదారిపై ఉన్న కోదండ రామాలయ ధ్వజస్తంభాన్ని సోమవారం ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు కోలాటాలు ఆడుతూ.. వైభవంగా ఊరేగింపు నిర్వహించారు. ఈ ధ్వజస్తంభాన్ని ప్రత్యేకంగా వరంగల్ జిల్లా ఆరేపల్లి గ్రామంలో పూర్తి నల్లరాయితో ప్రత్యేకంగా తయారు చేయించారు. జగద్గురు శంకరాచార్య, హంపీ విరూపాక్ష సంస్థానాధీశులు విద్యారణ్య భారతి మహాస్వామిచే శ్రీ కోదండ రామాలయంలో ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించనున్నారు. దీంతో పాటు ఆలయ ఆవరణలో మల్లికార్జున స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఈ సందర్భంగా పేర్కొన్నారు. ధ్వజస్తంభ పునః ప్రతిష్ఠ, శ్రీ మల్లికార్జున స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి కృపకు పాత్రులు కావాలని ఆకాంక్షించారు.

మేలు రకమైన విత్తనాలను విక్రయించాలి: ఎమ్మెల్యే

జూలూరుపాడు, ఫిబ్రవరి 26: రైతులకు మేలు రకమైన విత్తనాలను అందించాలని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ అన్నారు. సోమవారం జూలూరుపాడులో ఏర్పాటు చేసిన ఓ విత్తన దుకాణాన్ని ఆయన ప్రారంభించి, మాట్లాడారు. రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించకపోతే వారు తీవ్రంగా నష్టపోతారని తెలిపారు. వ్యాపారులు రైతులను నష్టపరచవద్దు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ లేళ్ల వెంకటరెడ్డి, ఎంపీటీసీ దుద్దుకూరి మధుసూదన్‌రావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాలోత్ మంగీలాల్‌నాయక్, నాయకులు కొదుమూరి జగన్నాథం, నున్నా కృష్ణయ్య నర్సనేని పుల్లారావు, కొలిపాక వెంకటేశ్వర్లు, కొదుమూరి కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రార్థనాలయాల్లో మైక్‌ల ధ్వని తగ్గించాలి

మణుగూరు, ఫిబ్రవరి 26: మణుగూరు మండలంలోని విద్యార్థులకు ఇది పరీక్షల సమయమని, విద్యార్థుల ఏకాగ్రతకు భంగం కలగకుండా ఉండేందుకు ప్రార్థనాలయాల్లో మైకుల ధ్వని తగ్గించాలని తహసీల్దార్ రాఘవరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో కోరారు. విద్యార్థులకు అత్యధికశాతం ఉదయం మూడు గంటల నుంచి 8 గంటల వరకు చదువుకునే సమయమని, ఆసమయాల్లో అన్ని మతాల ప్రార్థన మందిరాలు, దేవాలయాలు, మజీదులు, చర్చిలలో మైకుల ధ్వనులతో ఇబ్బంది కలిగించవద్దని కోరారు. ఈ విషయంలో ఎవరైన విరుద్ధంగా ప్రవర్తిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

28న వరంగల్‌లో ఏఐవైఎఫ్ రాష్ట్ర సమ్మేళనం

జూలూరుపాడు, ఫిబ్రవరి 26: మోదీ హఠావో - దేశ్ బచావో అనే నినాదంతో ఈ నెల 28వ తేదీన వరంగల్‌లో ఏఐవైఎఫ్ రాష్ట్ర సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఏఐవైఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి ఎస్‌కె.చాంద్‌పాషా తెలిపారు. సోమవారం జూలూరుపాడులో జరిగిన ఆ సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు.

మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

ఇల్లెందుటౌన్, ఫిబ్రవరి 26: అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని ఏరియా సేవా అధ్యక్షురాలు నిమ్మి ఆనందర్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక సైసీఓఏ క్లబ్‌లో నిర్వహించిన సేవా సమావేశంలో ఆమె మాట్లాడారు.

అపరిచితులకు ఆశ్రయం కల్పించొద్దు

మణుగూరుటౌన్, ఫిబ్రవరి 26: మణుగూరు మండలంలోని మారుమూల అటవీ ప్రాంతంలోని వలస ఆదివాసీ గిరిజన గ్రామం రేగులగండిలో సోమవారం సీఐ సతీష్‌కుమార్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజనలతో సమావేశమై పలు అంశాలపై మాట్లాడారు. గ్రామంలోకి ఎవరైన కొత్త వ్యక్తులు వస్తే వెంటనే తమకు సమాచారమివ్వాలని సూచించారు. అపరిచిత వ్యక్తులకు ఆశ్రయం కల్పించి అనవసరంగా చట్టపరమైన చర్యలకు గురికావద్దని హెచ్చరించారు.

వైభవంగా పుష్కర వార్షిక మహోత్సవాలు

కొత్తగూడెం సాంస్కృతికం, ఫిబ్రవరి 26: కొత్తగూడెంలోని ప్రగతినగర్ ఉమా మహేశ్వరస్వామి ఆలయ పుష్కర వార్షిక మహోత్సవాలను ఆలయ నిర్వాహకులు మేరెడ్డి జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఆలయంలో ఉమామహేశ్వరస్వామికి ఏకాదశ రుద్రాభిషేకం, చండీహోమం, రుద్రహోమం వంటి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం ఆలయంలో శివలింగాకృతిలో జ్యోతిలింగార్చన చేశారు. అధికసంఖ్యలో వచ్చిన భక్తులతో ఆలయంలో సందడి నెలకొంది.

ఐసీడీఎస్ అక్రమాలపై విచారణ చేపట్టాలి

మణుగూరు, ఫిబ్రవరి 26: పినపాక నియోజకవర్గంలో అంగన్వాడీ అప్‌గ్రేడ్ అవకతవకలపై జిల్లా అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని సీడీపీవో, సూపర్‌వైజర్ల డిప్యూటేషన్లను రద్దు చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వేల్పుల మల్లికార్జున్ డిమాండ్ చేశారు. యూనియన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అవకతవకలకు పాల్పడిన వారిపై విజిలెన్స్ అధికారులతో సమగ్ర విచారణ జరిపించాలని బాధ్యులైన వారిపై శాఖాపరమైన చర్యలను సత్వరమే చేపట్టాలన్నారు. సీనియర్ అంగన్‌వాడీ టీచర్లు వీరి ఆగడాలను అడ్డుకుంటున్నారనే నెపంతో టార్గెట్ చేసి వేధింపులకు గురిచేస్తూ నగదును దండుకున్నారని ఆరోపించారు. డిప్యూటేషన్‌పై ఏళ్ల నుంచి ఇక్కడే ఉంటూ తమకంటూ ఓ సామ్రాజ్యాన్ని ఏర్పాటు చేసుకుని ఆడిందే ఆటగా సాగిస్తున్నారని అలాంటి వారి డిప్యూటేషన్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ఔట్‌సోర్సింగ్ పోస్టులకు దరఖాస్తులు

కొత్తగూడెం పోస్టాఫీసు సెంటర్, ఫిబ్రవరి 26: జిల్లా వైద్యశాఖ ఇటీవల ప్రకటించిన కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పోస్టులకు దరఖాస్తు చేసేందుకు డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలో నిరుద్యోగ అభ్యర్థులు సోమవారం బారులు తీరారు. మూడు రోజుల పాటు ఈ దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు తొలి రోజు 740 మంది దరఖాస్తు చేసుకున్నట్లు డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయ ఏవో మోహన్ తెలిపారు.

విద్యార్థులకు స్టడీ అవర్స్ ఏర్పాటు చేయాలి

భద్రాచలం, ఫిబ్రవరి 26: ఇంటర్ పరీక్షలు దగ్గరపడుతున్నందున గురుకులాల్లోని విద్యార్థులకు ప్రత్యేక స్టడీ అవర్స్ ఏర్పాటు చేసి పరీక్షలకు సిద్ధం చేయాలని ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి డేవిడ్‌రాజ్ అన్నారు. భద్రాచలం ఐటీడీఏలో సోమవారం ఏర్పాటు చేసిన గిరిజన దర్బార్‌లో ఆయన జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి వద్ద నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గిరిజన దర్బారులో అందజేసిన వినతిపత్రాలను వివిధ శాఖల అధికారులు సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు.

రేషన్ బియ్యం పట్టివేత

దుమ్ముగూడెం ఫిబ్రవరి 26: అక్రమంగా నిల్వ చేసిన రేషన్‌బియ్యాన్ని మండల పరిధిలోని పెదకమలాపురం గ్రామంలో పోలీసులు పట్టుకున్నారు. సీఐ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. పెదకమలాపురం గ్రామంలో ఒడిస్సా రాష్ట్రానికి చెందిన రతన్ బిశ్వాల్ అనే వ్యక్తి ఇంట్లో అక్రమంగా దాచి ఉంచిన మూడు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారన్నారు.

ఎర్ర జెండాతోనే ప్రజా సమస్యల పరిష్కారం



మాట్లాడుతున్న మల్లు లక్ష్మి

మణుగూరుటౌన్, ఫిబ్రవరి 26: దేశంలో తొమ్మిదన్నర ఏళ్ల కాలం ప్రజా వ్యతిరేఖ విధినాలను అవలంభించిన బీజేపీని ఓడించడమే ఎర్రజెండా ప్రధాన లక్ష్యమని, దేశంలోని ప్రజా సమస్యల పరిష్కారం కేవలం ఎర్రజెండాతోనే సాధ్యపుతుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు, ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి అన్నారు. సోమవారం మణుగూరు మండల పరిధిలోని పగిడేరు గ్రామంలో జరిగిన ఎంపీటీసీ కుంజా కృష్ణకుమారి సంస్మరణ సభలో ఆమె మాట్లాడారు. కుంజా కృష్ణకుమారి ఆశయాలను కొనసాగిస్తామన్నారు. ఆహార భద్రత విషయంలో ప్రపంచంలో మన దేశం 111 స్థానంలో ఉందని, ఆకలి చావులను తప్పించాలన్నా.. ఆహార భద్రత పెరగాలన్నా మరో పోరాటం చేయకతప్పదని, ఆ బాధ్యత కమ్యూనిస్టులపైనే ఉందన్నారు. మాజీ ఎంపీ మిడియం బాబురావు మాట్లాడుతూ.. పగిడేరు గ్రామం పినపాక నియోజక వర్గంలో కమ్యూనిస్టు భావజాలం ఎక్కువగా ఉన్న ప్రాంతమని, ఉద్యమాలకు పేరుగాంచింది అన్నారు. కృష్ణకుమారి లేనిలోటు పార్టీకి తీర్చలేనిదన్నారు. కార్యక్రమంలో సీఐటీయు రాష్ట్ర కార్యదర్శి మధు, ఐద్వా జిల్లా నాయకులు ఎం.జ్యోతి, నాయకులు గద్దల శ్రీనివాసరావు, నిమ్మల వెంకన్న, బత్తుల వెంకటేశ్వరరావు, కొమరం కాంతారావు, సత్రపల్లి సాంబశివరావు, దామల్ల వెంకన్న, ఇతర పార్టీల నాయకులు గవ్వా రాంబాబు, కాటిబోయిన నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

4న ఐటీడీఏ ఎదుట ధర్నా

భద్రాచలం, ఫిబ్రవరి 26: భద్రాచలంలో న్యాయ కళాశాలను ఏర్పాటు చేయాలని మార్చి 4న ఐటీడీఏ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు గోండ్వాన సంక్షేమపరిషత్ రాష్ట్ర అధ్యక్షులు పాయం సత్యనారాయణ తెలిపారు. భద్రాచలంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతం ఐదో షెడ్యూల్‌లో ఉన్నందున ఆదివాసీల జీవన విధానం కొనసాగిస్తూ విద్యాభివృద్ధిలో వెనుకబాటుతనం కారణంగా ఇతర ప్రాంతాలకు వెళ్లలేకపోతున్నారని అన్నారు. గిరిజనులకు బీఈడీ కళాశాల ఏర్పాటు చేసిన మాదిరిగానే న్యాయ కళాశాలను ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ సమావేశంలో గడ్డం వెంకన్నబాబు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో వైద్య శిబిరం

మణుగూరుటౌన్, ఫిబ్రవరి 26: మణుగూరు పట్టణంలోని ఎంజేపీటీ బీసీ బాలుర గురుకుల పాఠశాలలో సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శివకుమార్ విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. దగ్గు, జలుబు, జ్వరంతో బాధపడుతోన్న విద్యార్థులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శివకుమార్ మాట్లాడుతూ.. వ్యక్తిగత పరిశుభ్రతను విద్యార్థులందరూ ఖచ్చితంగా పాటించాలని ఆయన సూచించారు.

నేటి నుంచి హాస్టల్ వర్కర్ల సమ్మె

జిల్లాలో 82 హాస్టళ్లలోని 13 వేల మంది విద్యార్థులపై ప్రభావం

రేపటి నుంచి ఇంటర్ పరీక్షలతో పొంచి ఉన్న సమస్యలు


సమ్మె నోటీసు అందజేస్తున్న దృశ్యం

భద్రాచలం, ఫిబ్రవరి 26: గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని పోస్టుమెట్రిక్ హాస్టల్స్‌లో పని చేస్తున్న ఆవుట్‌సోర్సింగ్ వర్కర్లకు వేతనాలు నెలల తరబడి లేకపోవడంతో వారు సమ్మెబాట పట్టారు. ఈ క్రమంలో సోమవారం భద్రాచలంలోని హాస్టల్ వార్డెన్‌కు సమ్మె నోటీసును అందజేశారు. ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ శాఖకు చెందిన 60 ఆశ్రమ పాఠశాలలుండగా అందులో 10వేల మంది విద్యార్థులున్నారు. అలాగే జిల్లాలోని పోస్టుమెట్రిక్ హాస్టల్స్ 22 ఉండగా అందులో మూడువేల మంది ఉన్నారు. పోస్టుమెట్రిక్ హాస్టల్స్‌లో పని చేసే వంద మంది, ఆశ్రమాల్లో పని చేసే 400 మంది సిబ్బంది తమకు వేతనాలు నెలల తరబడి రాకపోవడంతో పలుమార్లు ఇప్పటికే సమ్మె నోటీసులు ఇచ్చారు. అయినా పరిష్కారం కాకపోవడంతో సీఐటీయు ఆధ్వర్యంలో సమ్మెలోకి వెళ్తున్నట్లు జిల్లా అధ్యక్షులు కె.బ్రహ్మాచారి తెలిపారు. ఆశ్రమ పాఠశాలల్లో పని చేస్తున్న వారికి 17 నెలల వేతనాలు చెల్లించాల్సి ఉండగా పోస్టుమెట్రిక్ హాస్టల్స్‌లో పని చేసే వారికి నాలుగు నెలల వేతనాలు చెల్లించాల్సి ఉంది. ఇదిలా ఉండగా బుధవారం నుంచి ఇంటర్ వార్షిక పరీక్షలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఆవుట్‌సోర్సింగ్ సిబ్బంది సమ్మెకు దిగడంతో విద్యార్థులకు అల్పాహారం, భోజనం ఏ విధంగా అందుతుంది అనేదానిపై సర్వత్రా ఆందోళన నెలకొంది. మంగళవారం నుంచి నిరవధిక సమ్మెలోకి దిగుతుండటంతో ఈ ప్రభావం ఇంటర్, డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులతో పాటు ఇతర విద్యార్థులపై సైతం పడనుంది.

డిప్యూటీ సీఎం త్వరలోనే స్పందిస్తామన్నారు

మణెమ్మ, గిరిజన సంక్షేమ శాఖ డీడీ

ఇటీవల జరిగిన ఐటీడీఏ పాలక మండలి సమావేశం సమయంలో పెండింగులో ఉన్న వేతనాల చెల్లింపు విషయం డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకు రావడం జరిగింది. డిప్యూటీ సీఎం సానుకూలంగా స్పందించి వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే ఆశ్రమ పాఠశాలలకు చెందిన సిబ్బందికి నాలుగు నెలల వేతనాలను పీవో ప్రత్యేక చొరవతో అందజేయడం జరిగింది. విద్యార్థుల పరీక్షలు ప్రారంభమవుతున్న వేళ సిబ్బంది మానవతా దృక్పథంతో సహకరించాలి. త్వరలోనే వేతనాలు పూర్తిస్థాయిలో చెల్లించేందుకు ఉన్నతాధికారులు చర్యలు చేపడుతున్నారు.

అక్షరాస్యత వారోత్సవాలను జయప్రదం చేయాలి

కొత్తగూడెం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలను జయప్రదం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల అన్నారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విడుదల చేసిన పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిబ్రవరి 26 నుంచి మార్చి 1 వరకు ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఫిబ్రవరి 27న జిల్లా లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో జరుగనున్న 2 కె వాకథాన్ లో పాల్గొని జయప్రదం చేయాలని ఆమె కోరారు. ఈ వాకథాన్ ప్రభుత్వ రెసిడెన్సియల్ హైస్కూల్ పాల్వంచ నుంచి ఉదయం 7 గంటలకు ప్రారంభం అవుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ నెల 29వ తేదీన రామచంద్ర డిగ్రీ కళాశాలలో ఆర్థిక అక్షరాస్యత అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులకు చిన్న వయసు నుండే ఆర్థిక క్రమశిక్షణ నేర్పించే విధంగా రిజర్వ్ బ్యాంక్ ఇండియా పనిచేస్తుందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో రవీంద్రనాథ్, డీఆర్‌డీఏ పీడీ విద్యాచందన, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రామిరెడ్డి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.